

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

మలికిపురం
12-5-95

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా !

మనకు శరీరము వచ్చింది అంటే ఏదో కాలక్షేపం కోసం వచ్చింది అని అనుకోవద్దు. ఈ భూమి మీద మనకు కొంత కర్మానుభవం కలగటం కోసం ఈ శరీరము వచ్చింది. ఈ శరీరము ద్వారా మనకు ఎటువంటి అనుభవాలు కలగాలో అవి కలిగేవరకూ ఈ శరీరము ఉంటుంది, తరువాత శరీరము మరణిస్తుంది. సరదాకు ఈ శరీరము వచ్చింది అని అనుకోవద్దు. కర్మానుభవం కోసం ఈ శరీరము వచ్చింది.

కర్మ అనుభవించటం వలన క్షయిస్తుంది. ఇష్టంతో అనుభవిస్తే వచ్చే జన్మలో ఇటువంటిది ఎదురవ్వదు. కుటుంబము, శరీరము, రంగు ఇవి అన్నీ కర్మను బట్టి వస్తాయి. శరీరమును ప్రారబ్ధమునకు విడిచిపెట్టి వచ్చిన పని చూసుకో అని భగవాన్ చెపుతూ ఉండేవారు.

భగవంతుడు ఉన్నాడా, లేడా అన్నది సమస్యకాదు. మనకు దుఃఖము వస్తోంది. ఏ కారణం వలన దుఃఖము వస్తోంది? ఆ కారణమును ఎలాగ తొలగించుకోవాలి అనేది ముఖ్యము.

మన ప్రవర్తన సక్రమంగా ఉంటే, మనోనిగ్రహం క్రమంగా ఉంటే, ఆలోచన నిదానంగా ఉంటే భగవంతుడు ఉన్నాడు అని నమ్మినా, నమ్మకపోయినా మీకు మోక్షం వస్తుంది. మన హృదయంలో సద్వస్తువు ఉంది. ఆ వస్తువు అనుభవంలోనికి రాకుండా మన అలవాట్లు, మన కోరికలే అడ్డు వస్తున్నాయి.

గర్వము, ఆశ కొద్దిగా తగ్గించుకుంటే మనలోపల ఉన్న చైతన్యము కొద్దిగా మనకు తెలుస్తూనే ఉంటుంది. బాహ్య గొడవలు చూసుకొని మనం గర్వం తెచ్చుకుంటూ ఉంటాము. ఇవి అన్నీ నిలబడేవి కావు. ఇవి అన్నీ స్వప్న సమానము. ఇవి అన్నీ ఉంటాయి అనుకొన్నా మనదేహము ఏదో రోజు జారిపోతుంది. ప్రపంచములో ఉన్న వస్తుజాలమును చూచుకొని మనం గర్వం తెచ్చుకోకూడదు.

మన జీవయాత్రకు సరిపడే సామగ్రిని చూసుకొంటూ, ఇతరుల మీద ఆధారపడకుండా మన పని మనం చేసుకొంటూ, ఇతరులకు వీలయిన సహాయం చేస్తూ, ఒక అవతార పురుషునిగాని గురువును గాని ఆరాధిస్తూ, భక్తి మార్గము, కర్మ మార్గము, ధ్యాన మార్గము, జ్ఞానమార్గములను సమన్వయం చేసుకొంటూ ముందుకు వెళితే వస్తువు మనకు దొరుకుతుంది. భక్తి మార్గము, ధ్యాన మార్గము, కర్మ మార్గము, జ్ఞాన మార్గము ఒకదానికి ఒకటి విరోధులు కావు. పూర్వజన్మ సంస్కారమును బట్టి ఒకోవ్యక్తికి ఒకో మార్గము మీద ఇష్టం కలుగుతుంది.

మనస్సు నిర్మలంగా ఉండాలి. ఉద్రేకమునకు దూరంగా ఉండాలి. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఉద్రేకమునకు గురికాకుండా మన పనిని సక్రమంగా చేసుకోవాలి. మన పనిని మనం సక్రమంగా చేసుకోవటం వలన కూడా ఈశ్వరుని దయ మనకు కలుగుతుంది.

ఎవడికైతే పవిత్రమైన మనస్సు ఉందో వాడికి జ్ఞానము కలుగుతుంది గాని కుయుక్తులవలన, కుతంత్రాలవలన జ్ఞానం కలుగదు. సహృదయం ఉన్నవాడు, సద్బుద్ధి ఉన్నవాడు జ్ఞానమును పొందటానికి యోగ్యుడుఅవుతాడు.

నీకు వెంటనే ఫలితము కావాలంటే ఇప్పుడే ఇక్కడే ఫలితము కావాలంటే నీవు నేను, నేను అంటున్నావు కదా. నేను ఎవడను, నేను ఎవడను అని నామంలా జపించటం కాదు. నువ్వు ఎవరు అని నేనును ప్రశ్నించు అంటున్నారు భగవాన్. నేను ఎవడను అనేది సమాధానం కాదు. అది ప్రశ్న. దానికి సమాధానం ఆత్మజ్ఞానము. నువ్వు ఎవడవు అని నేనును ప్రశ్నించటం వలన అది బాహ్యంగా విజృంభించటం మాని నేను అనే బుద్ధి ఎక్కడ పుడుతోందో అక్కడకు మళ్ళించ బడుతుంది. అంటే వెనుకకు వెళుతుంది. ప్రశ్నిస్తూ దానిని వెనుకకు తోలుకొని వెళితే దాని మూలంలోనికి వెళ్ళిపోతుంది. దాని మూలంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో దానిని ప్రశ్నించటం ఎవరికీ ఇష్టముండదు. చెప్పే నాకు ఇష్టముండదు. వినే మీకు ఇష్టముండదు. ఏదైనా బొమ్మను ఆరాధించమంటే తేలికగా చేసేస్తారు. ఇష్టములేక పోవటానికి కారణము ఏమిటంటే ఈ నేనును ప్రశ్నించటం వలన మనం లేకుండా పోతామేమోనన్న భయం. మనం ఉండకుండా పోవటం మనకు ఇష్టమా? లేదు. మనకు ఉండాలనే ఉంది. అందువలన చెపుతున్నట్లు నేను నటిస్తున్నాను, విన్నట్లు మీరు నటిస్తున్నారు. దీనిని విచారణ చేయటానికి ఎవరూ సిద్ధ పడటం లేదు.

మనము లోకమును చూసేటప్పుడు నామము, రూపము, గుణములను తీసివేసి ఒక ప్రక్కన పెట్టి చూస్తే అంతా ఈశ్వర స్వరూపముగానే కనబడుతుంది. ఈశ్వరుడు లేకుండా దేహము రానేరాదు. కాని మనకు ఈశ్వరుడు మీద దృష్టి లేదు. నామమును, రూపమును, గుణమును చూస్తున్నాము. నామము, రూపము, గుణములను తీసివేయండి. అప్పుడు అంతా ఈశ్వర స్వరూపముగానే కనబడుతుంది. బేధ బుద్ధి నశిస్తుంది. గుడిలో దేవుని ఎలా చూస్తున్నామో లోకం అంతా అలా చూడటం అలవాటు చేసుకోండి. లోకం అంతా పరమేశ్వరునిగా చూడటం నేర్చుకుంటే రాగ ద్వేషము తగ్గుతాయి. ఉద్రేకములు తగ్గుతాయి. సమాన బుద్ధి కలుగుతుంది.

ఉన్నది ఒకటే వస్తువు. అది మన హృదయంలో ఉంది. అది తెలిసే వరకూ ఏదో ఒక శవమును మోస్తూ ఉండవలసిందే. ఏ శవములో ఉన్నప్పుడు ఆ శవమును అలంకరించుకొంటూ ఉంటాము. శరీరము ఉండగానే నీ హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికి వస్తే శరీరము పడిపోయిన తరువాత కూడా ఆ స్థితి కొనసాగుతుంది. ఇప్పుడు శరీరము మనకు అనుభవంలో ఉంది. ఇది మరణిస్తుంది. కాని చావులేని వస్తువును ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడి దేహము దేవాలయం అవుతుంది. చావులేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. దేహము మరణించకముందే ఆ చావులేని వస్తువును ఎవడైతే తెలుసుకొన్నాడో అది వాడి చావును చంపేస్తుంది. శరీరము చనిపోతున్నా నేను చనిపోవటంలేదు అనే అనుభవం వాడికి వచ్చేస్తుంది.

శాస్త్ర జ్ఞానముతో సంబంధము లేకుండానే అది ప్రత్యక్షముగా అనుభవంలోనికి వస్తుంది. దేహం ఉండగానే ఈ అనుభవం రావాలి.

చావులేని వస్తువు, ఆనందమును కలుగజేసే వస్తువు, నిత్య వస్తువు నీ హృదయంలో స్వయంగా ప్రకాశిస్తోంది. ఆ వస్తువు గురించి శ్రవణం చేయండి, మననం చేయండి. విషయమును జాగ్రత్తగా విని, దానిని మననం చేసుకుంటే ఆ విషయం మీ సొంత మవుతుంది. శ్రవణం చేయగా, చేయగా దానిని పొందాలనే ప్రీతి మీకు కలుగుతుంది. పరమేశ్వరుడు మన హృదయంలో ఉన్నప్పటికీ వాడిని తెలుసుకోవాలనే బుద్ధి మనకు కలగటం లేదు అంటే దానికి మనలోని పాపములు, దోషములు, బలహీనతలే కారణము. మన ఆలోచనలో పొరపాటు ఉంది. జీవిత విధానములో పొరపాటు ఉంది, అలవాట్లో పొరపాటు ఉంది. ఏదో మనకు తెలియని పొరపాట్లు ఉన్నాయి. ఈ పొరపాట్ల వలన వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష మనకు కలగటం లేదు. తెలుసుకోవాలనే కాంక్ష బలీయంగా మన హృదయంలో నుండి వస్తూ ఉంటే వాడికి ఈశ్వరానుగ్రహం ఉన్నట్లు గుర్తు.

ఉన్న వస్తువునే ఈశ్వరుడు అంటున్నాము. వాడు మన హృదయంలోనే ఉన్నాడు. జీవుడు కొంత అంతర్ముఖుడు అయినపుడు అంటే వాడి చేతికి జీవుడు కొద్దిగా అందినపుడు వాడిని హృదయంలోనికి లాక్కొని వాడిని కరగబెడతాడు. జీవుడు కరిగిపోవటం వలన మనం ఉండమేమో అనుకొంటాము. కాని జీవుడు కరిగిపోటం వలన మనం ఎవరిమో మనకు తెలుస్తుంది.

గాఢనిద్రలో తలంపులు లేవు. అయినా మనం ఉన్నాము. అక్కడ హద్దులు లేవు, అంచులు లేవు. హద్దులు, అంచులు అన్నీ తలంపులు వచ్చాక వస్తున్నాయి. నీకు తలంపు వచ్చాక ఒక కులంతోటి, ఒక జాతితోటి, ఒక దేశంతోటి తాదాత్మ్యము పొందుతున్నావు. తలంపులు వచ్చాక ఈ హద్దులు, అంచులు వస్తున్నాయి. తలంపులు లేనపుడు హద్దులు లేవు, అంచులు లేవు. అంటే తలంపులే నిన్ను బంధిస్తున్నాయి. ఇప్పుడు మనం అజ్ఞానము అనే జైలులో ఉన్నాము. అందులో నుండి విడుదల పొందటమే మోక్షము. మోక్షము అంటే విడుదల. దేహము మరణించకముందే మోక్ష సుఖమును కొన్ని క్షణాలయినా అనుభవిస్తే మనస్సు దానంతట అదే లోపలకు వెళుతుంది. మోక్షం గొడవ, బంధము గొడవ వదిలెయ్యి. వాటి గురించి నీకు తెలియటం లేదు కదా. నీకు నేను గురించి తెలుస్తోందికదా దానిని విచారణ చెయ్యి. ఇప్పుడే, ఇక్కడే జ్ఞానము వస్తుంది. వస్తువు అనుభవంలోనికి వస్తుంది. మోక్షమును సంపాదించాలి అని నీ మనస్సును మోక్షం మీద పెట్టే బదులు ఈ నేను గొడవ వదిలించుకుంటే మోక్షం ఇక్కడే ఉంది కదా అంటున్నారు భగవాన్. ఎప్పుడో పొందుతాము, ఎక్కడో పొందుతాము అనుకున్నది ఇప్పుడే, ఇక్కడే వచ్చేస్తుంది అంటున్నారు.

కుటుంబపరంగా గాని, సమాజ పరంగా గాని ఎన్ని గొడవలు వచ్చినా కంగారు పడవద్దు. ఈ గొడవలు అన్నీ ఎవరికి వస్తున్నాయి అని ప్రశ్నించుకోండి అని భగవాన్ చెపుతున్నారు. ఇవి అన్నీ మిథ్యా నేనుకు వస్తున్నాయి. ఇది నిజంకాదు. నిజంలాగ కనబడుతోంది. దీనిని విచారణ చెయ్యండి.

ఎవరైనా ఏదైనా అడిగినపుడు దాని గురించి మనకు తెలియదు అనుకోండి అప్పుడు మనకు తెలిసీ, తెలియని మాటలు చెప్పటం కంటే ఆలోచించి చెపుతాను అని చెప్పటం మంచిది.

మనం చేసే కర్మను బట్టి జన్మ వస్తుంది. జన్మ వచ్చాక కర్మ చేస్తాడు. మరల దానిని బట్టి జన్మ వస్తుంది.
రాబోయే జన్మకు కర్మ కారణం అవుతుంది. మీరు పనిచేస్తున్నప్పటికి పునర్జన్మకు సంబంధించిన
హేతువులు పడకుండా చూసుకుంటే అది యోగము అన్నాడు పరమాత్మ. ఫలదృష్టిలేకుండా పనిచేస్తే మీకు
సంస్కారములు పడవు. సంస్కారములు పడకుండా పనిచేస్తే అది యోగము.

ఏ మనిషికి ఆ మనిషికి నేను అంటేనే ఇష్టము. దాని కోసమే జీవిస్తున్నాడు. నీకు ఉన్న భక్తి నిజమయితే ఈ
నేనును దేవునికి ఆహారముగా ఇచ్చివేయి అంటున్నారు భగవాన్. మనకు దేవుడు కావాలా, అహంకారము
కావాలా అనేది చూసుకోవాలి. దేవుడు కావాలంటే అహంకారమును వదులుకోవాలి. అహంకారము
కావాలంటే దేవుని వదలుకోవాలి. ఏదో ఒకటి వదలుకోవాలి. అహంకారమును వదలుకుంటే దేవుడు
తెలియబడతాడు. అందువలన నిన్ను నీవు కాదు అనుకో. దేవుడు ఉన్నాడు. మనంలేము. కాని దేవుడు లేడు,
మనం ఉన్నాము అని మనం అనుకొంటున్నాము. లేని దానిని ఉంది అనుకొంటున్నాము. ఉన్నదానిని లేదు
అనుకొంటున్నాము. ఇలా అనిపించటానికి కారణము మనలోని అజ్ఞానము. అజ్ఞానము వలననే అన్ని
చిక్కులూ వస్తున్నాయి. అందరూ దేవుని తెలుసుకోవాలి అని అంటున్నారు. కాని దేవుని తెలుసుకోవాలనే ఈ
నేను ఎవడో ముందు తెలుసుకోండి. తరువాత దేవుని తెలుసుకోవచ్చు అంటున్నారు భగవాన్. ఈ నేను ఎవరో
తెలిస్తే దేవుడు తెలుస్తాడు. కర్మను బట్టి జన్మ వస్తుంది అంటున్నారు. ఈ కర్మనుండి విడుదల పొందటం ఎలాగ
అని భగవాన్‌ను అడిగితే కర్మ ఎవరికి అన్నారు భగవాన్. నేనుకు అని చెప్పాడు. ఈ నేను నుండి విడుదల పొందితే
కర్మనుండి విడుదల పొందుతావు అన్నారు భగవాన్. మనం మంచి చేసినా, చెడ్డ చేసినా దేహము నేను అనే
బుద్ధితో చేస్తాము. అందువలన రాబోయే జన్మలలో దేహము నేను అనే బుద్ధిని ఉంచి దీనిని అనుభవించజేస్తాడు
పరమాత్మ. దేహము నీవు కాకపోయినా దేహము నేను అనే బుద్ధి నీకు ఎందుకు ఉందంటే కర్మను అనుభవింప
జేయటానికి భగవంతుడు నిన్ను దేహమునకు కట్టివేస్తాడు.

నీవు సాధన చేసేటప్పుడు కొంత దూరము వెళ్ళాక మనస్సు కొన్ని దొంగ సమాధానాలు చెపుతుంది. అది
చూసి ఆగిపోవద్దు. మనస్సు దొంగది కాబట్టి అది దొంగ సమాధానాలు చెపుతుంది. నీవు గొప్పవాడివి
అయిపోయావు, నీవు పవిత్రుడవు అయిపోయావు, నీవు జ్ఞానివి అయిపోయావు అని దొంగ సమాధానాలు
చెపుతుంది. అక్కడ ఆగిపోవద్దు అంటున్నారు భగవాన్. మనస్సు అబద్ధం అయినపుడు అది చెప్పేది నిజం ఎలా
అవుతుంది. అందువలన మనస్సును ప్రక్కకు పెట్టి నీ ప్రయాణం నీవు చూసుకో అంటున్నారు. వేదములలో
చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకో. బ్రహ్మానుభవం పొందినవాడి మాటను ప్రమాణంగా తీసుకో.

ఈ బోధలు, ధ్యానాలు, జపాలు అన్నీ రెండవ పక్షము. గురువు అనుగ్రహము అతి ప్రధానమైనది. అతి
బలీయమైనది. గురువు యొక్క ఒక్క చూపు చాలు మనం బాగుపడటానికి. అది శవం చూపువంటిదికాదు.
శివుని చూపు లాంటిది. అది జ్ఞానమునకు సంబంధించిన చూపు. నీవు ఏజన్మలో ఉన్నా నీ మనస్సు
పక్వమునకు వచ్చేవరకూ దానిని తరుముకొని వెళుతుంది.

ఇతరులను గౌరవముగా, మర్యాదగా చూడటం వలన మనకు అహంకారము తగ్గుతుంది. ఇతరులను
అగౌరవముగా చూడటం వలన మనకు అహంకారము పెరుగుతుంది. ఇతరులు ఎటువంటి వారు అయినా
మంచివారు అయినా, చెడ్డవారు అయినా వారిని గౌరవముగా చూడటం వలన మనలోని అహంకారము

తగ్గుతుంది. ఇతర జీవులను గౌరవించమని భగవంతుడు చెప్పాడు కాబట్టి గౌరవించటం. వారు చెడ్డవారు
అయినా మనకు అనవసరము.

నీవు ఏదోరకంగా ఉంటున్నావు. దేహముగానో, మనస్సుగానో, అహంకారముగానో ఉంటున్నావు.
ఉండటం ఎలాగూ తప్పదు. అందువలన ఆత్మగా ఉండు గొడవ వదిలిపోతుంది అంటున్నారు భగవాన్.

కరెంటు ఆగిపోయింది అనుకోండి దానికోసం అందరినీ తిట్టే బదులు కిరసనాయిలు దీపం
వెలిగించుకోండి. తిట్టటం వలన వెలుగువస్తుందా? రాదు. అందువలన దీపం వెలిగించుకోండి. మంచిగా
ఉన్నాము, చెడ్డగా ఉన్నాము అంటే ఏమి కలిసివస్తుంది. ఈ గొడవ వదిలేసి జ్ఞాన దీపం వెలిగించుకోండి.
అప్పుడు చెడ్డ ఉంటే అదే పోతుంది. జ్ఞానమును సంపాదించుకోవటం మానివేసి మేము చెడ్డవాళ్ళము, మేము
మంచి వాళ్ళము అని ఇలా అనుకోవద్దు అంటున్నారు భగవాన్.

మనం బాధగాజీవించకూడదు. గాఢముగాజీవించాలి. జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వస్తే సాధన వదిలి
వేస్తాము. అందువలన జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు. ప్రతీక్షణం ఉపయోగించుకోవాలి. చేతిలో
ఉన్న వర్తమాన కాలమును ఉపయోగించుకో. దానిలో గాఢముగా జీవించు. జరిగిపోయిన గొడవలు
తలపెట్టుకోవద్దు. భవిష్యత్ గొడవల గురించి ఊహించవద్దు. చేతిలో వర్తమానకాలము ఉంది. దానిని
ఉపయోగించుకో. దానిలో సజీవముగా ఉండు. గాఢముగా జీవించు.

కోపం వచ్చినపుడు కొంతసేపు మాట్లాడకుండా ఉండటం మంచిది. ఎందుకంటే కోపం వచ్చినపుడు
మన నోటినుండి మంచి మాటలు రావు. చెడ్డ మాటలు వస్తాయి. ఆ మాటలకు ఈ జన్మలో కాకపోయినా వచ్చే
జన్మలో అయినా మనం సమాధానం చెప్పుకోవాలి.

మనం నిజమైన స్థితిలో ఉంటే ప్రయత్నము అక్కరలేదు. జ్ఞానం సంపాదించాలి, దేవుని తెలుసుకోవాలి
అనుకొంటున్నాము. ఎందువలన అంటే మనలో ఏదో వెలితి ఉంది అని మనకు తెలుస్తోంది. మనం పూర్ణ
స్థితిలో లేము అని మనకు తెలుస్తోంది. మనం ఉన్నది నిజమైన స్థితి అయితే దేవుని తెలుసుకోవాలనే బుద్ధికూడా
మనకు కలుగదు. మనలో ఉన్న వెలితి వలన ఏదో తెలుసుకోవాలని మనకు అనిపిస్తోంది.

మాటల విషయములో జాగ్రత్త అవసరము. ఏది మాట్లాడుతున్నామో తెలుసుకొని మాట్లాడాలి. ఏదైనా ఒక
మాట చెప్పేటప్పుడు చెప్పేవాడికి ఆ మాటకు సంబంధించిన అనుభవం లేకపోతే దాని ప్రభావము వినేవాడి
మీద ఉండదు. సాధ్యమైనంతవరకు తక్కువ మాట్లాడాలి. తక్కువ మాట్లాడే వాడికి గౌరవం ఉంటుంది.
ఎక్కువ ఆలోచించాలి. తక్కువ మాట్లాడాలి.

నా పనిని సక్రమంగానే చేస్తున్నాను. ఈ రోగిని డాక్టరుగారు సరిగా చూడలేదు అని ఎవరైనా విమర్శిస్తే
నాకు దుఃఖము కలుగుతోంది అని ఒక డాక్టరుగారు అడిగారు. ఈ రోగిని బాగాచూసారు, జబ్బు నయం
అయింది. డాక్టరుగారు చాలా గొప్పవారు అని ఎవరైనా అంటే మీకు సంతోషము వస్తోందా అని అడిగాను.
సంతోషము వస్తోంది అని చెప్పారు. మీరు గొప్పవారు అన్నప్పుడు సంతోషము వస్తే, మిమ్మలను
విమర్శించినపుడు దుఃఖము కూడా తప్పక వస్తుంది. దానిని ఎదుర్కొన్నప్పుడు, దీనిని కూడా ఎదుర్కోవాలి

అని చెప్పాను.

ఎవరైనా పొగడినపుడు సంతోషమును ఆపుచేసుకుంటే, నిగ్రహించుకుంటే ఎవరైనా విమర్శించినపుడు దుఃఖము రాదు. ఇవి అన్నీ ఎందుకంటే ఎవరైనా పొగడినపుడు సంతోషిస్తే అది అహంకారమునకు మేత. ఎవరైనా విమర్శించినపుడు దుఃఖమువస్తే అది అహంకారమునకు మేత. అహంకారమునకు మేత లేకుండా చేస్తే అది నశిస్తుంది.

భగవంతునికి రెండుసార్లు నవ్వు వస్తుంది అని రామకృష్ణుడు చెప్పాడు.

౧. వీడిని నేనే బ్రతికించాను. ఇక్కడకు రావటం ఆలస్యమైతే చాలా కష్టం. నావలన బ్రతికాడు అని డాక్టరు అన్నప్పుడు దేవునికి ఒకసారి నవ్వు వస్తుంది.

౨. అన్నదమ్ములు పంచుకొనేటప్పుడు ఏదో చెట్లు దగ్గర పేచీ వస్తే, చిన్న విషయం దగ్గర తేడా వస్తే కోర్టుల దాకా వెళ్ళిపోతారు. అంత వరకూ నా అన్న, నా తమ్ముడు అనుకొంటారు. చిన్న పేచీ వస్తే కోర్టులదాకా వెళతారు. అప్పుడుకూడా దేవుడు నవ్వుకుంటాడు.

ఏ నేను నుండి విడుదల పొందాలో దాని నుండి విడుదల పొందటం మానివేసి దానిని కైలాసమునకో, స్వర్గలోకమునకో తీసుకొని పోదాము అని చూస్తున్నాము. ఇదే మహా మాయ. మనం ప్రయాణములకు అలవాటు పడిపోయి దానిని ఆ లోకమునకు, ఈ లోకమునకు తీసుకొని పోవాలి అని చూస్తున్నాము. అక్కరలేని గొడవల లోనికి వెళ్ళకూడదు. వీటివలన అహంకారము పెరుగుతుంది. సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలోనికి వెళ్ళవద్దు అని రమణాచార్యుడు చెపుతున్నాడు.

ఇతరులకు నీవు ఏదైనా చేస్తే అది నీకు తిరిగి వస్తుంది. ఇతరులకు చేసేది తిరిగి నీకే వస్తుంది అని తెలిస్తే చేయకుండా ఎలా ఉండగలరు అన్నారు భగవాన్.

చైతన్యస్థాయిని పెంచుకోవాలంటే శారీరక ఆరోగ్యము, మానసిక ఆరోగ్యము బాగుండాలి. శరీరములో అనారోగ్యము ఉంటే ఎక్కువగా శరీరము జ్ఞాపకము వస్తుంది. మనస్సులో చింత ఉంటే అస్తమానూ మనస్సు జ్ఞాపకం వస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే ముందు శరీరమును, మనస్సును మర్చిపోవాలి. చిన్న చిన్న గొడవలమీద మనస్సును పెట్టవద్దు. ఇలా చేస్తే వచ్చిన పని మర్చిపోతాము.

*(జిన్నూరు మీటింగ్ 25-6-95)*